క్లుప్తంగా

బీటీ రోడ్ల నిర్మాణం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో పలు చోట్ల సుమారు రూ.45 లక్షలతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఎన్‌జీజీవోస్ కాలనీలో ఇండియన్ పెట్రోల్ బంక్ పక్క లైన్, విద్యుత్ నగర్ ఆరోగ్య కేంద్రం పక్కలైన్‌లో బీటీ రోడ్లు నిర్మించారు. శుక్రవారం క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 అడుగుల రోడ్డుకు ఇరువైపులా, సరోజ ఆస్పత్రి లైన్‌లో బీటీ రోడ్లు నిర్మిస్తామని ఏఈ లావణ్య తెలిపారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఈ డి.శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, ఏఈ లావణ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

రామలింగేశ్వరాలయంలో సంప్రోక్షణ పూజలు



ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో పునః ధ్వజ స్తంభ ఇత్తడి తాపడం సంప్రోక్షణ, చండీశ్వర శిఖర స్థాపన గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో 4 కిలోల గంజాయి స్వాధీనం



ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులో గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. గురువారం ఉదయం మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లోని పలు రైళ్లలో రైల్వే భద్రతా దళం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సలీం పాషా, అమ్ముకుట్టి, నిషాదేవిలు కర్ణాటకకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వీరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించినట్లు మర్రిపాలెం ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు



బయోడైవర్సిటీ పార్క్‌లో ఏయూ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ఆంధ్రా యూనివర్సిటీ పర్యావరణ విభాగం విద్యార్థులు గురువారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాల గురించి తెలియజేశారు.

విశ్వకర్మ అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు వినతి

డాబాగార్డెన్స్: సింహాచలం వరాహ నరసింహ స్వామి దేవస్థానంపై విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు ఆలయ పరిసర ప్రాంతంలో కొంత స్థలం కేటాయించాలని విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం దేవదాయ శాఖ ఉప కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో అన్నసమారాధన సత్రం నిర్మించారని, అదే విధంగా విశాఖలో సింహాచలం కొండపై సత్రం నిర్మించి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీర్వాదంతో అప్పన్న స్వామి భక్తులకు సేవ చేయాలని తీర్మానించామని, కొంత స్థలం కేటాయిస్తే జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున సొంత నిధులతో భవన నిర్మాణం చేపట్టి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు.

భయపెడుతున్న మ్యాన్‌హోళ్లు

- మర్రిపాలెం శివనగర్ రోడ్డులో ప్రమాదకరంగా మారిన వైనం
- రాకపోకల సమయంలో వాహన చోదకుల పాట్లు
- సమస్య పట్టించుకోని అధికారులు



మ్యాన్‌హోల్ చుట్టూ గొయ్యి



మర్రిపాలెం శివనగర్ రోడ్డులో ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్

మర్రిపాలెం: అవి స్పీడ్ బ్రేకర్లు కాదు.. అక్కడికి వస్తే వాహన చోదకులు భయపడి బ్రేక్ వేయాల్సిందే. లేకుంటే ప్రమాదానికి గురికావాల్సిందే. ఇది జోన్-5 పరిధి 53వ వార్డు మర్రిపాలెం శివనగర్ రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోళ్ల దుస్థితి. ప్రతిసారి రోడ్డు వేసే క్రమంలో మ్యాన్‌హోళ్లను తవ్వుతుంటారు. వాటిని రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయాలనే విషయాన్ని మరుస్తారు. వాస్తవానికి రోడ్డు నిర్మించిన వెంటనే మ్యాన్‌హోల్ చుట్టూ రహదారికి సమానంగా ప్లాట్‌ఫారం నిర్మాణాల ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉంది. ఘనత వహించిన ఇంజినీర్లు ఈ నిబంధన పట్టించుకోకపోవడం వల్ల.. అలా జరక్కపోవడంతో మ్యాన్‌హోళ్ల గోతుల్లా మారి భయపెడుతున్నాయని స్థానికులు, వాహన చోదకులు వాపోతున్నారు. దీంతో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా ఉంటోందని అంటున్నారు. మ్యాన్‌హోళ్ల చుట్టూ గుంతలా ఏర్పడటం, చుట్టుపక్కల రోడ్డు కూడా చిన్న చిన్న గతుకులుగా ఉండడం వల్ల అటుగా ప్రయాణాలు సాగించేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.

మరమ్మతులు చేపట్టాలి

వాస్తవానికి జీవీఎంసీ కాంట్రాక్టర్లు వేసే రోడ్లలో నాణ్యత తక్కువ అన్నది జగమెరిగిన సత్యం. రహదారులను నిర్మించిన తర్వాత సరైన నిర్వహణ కొరవడి త్వరగా అవి గోతులుగా మారుతున్నాయి. రోడ్డు వేసిన వెంటనే యూజీడీ మ్యాన్‌హోళ్ల వద్ద ప్లాట్‌ఫారం నెలల తరబడి ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫలితంగా వర్షాలు పడే సమయంలో కొత్తగా ఉన్న రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలా ఉన్న చోట వాహనాలు నడపడం వల్ల టైర్లు పాడవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. అటుగా నడిచి వెళ్లే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి నడుస్తున్న సమయంలో చూసుకోకుండా మ్యాన్‌హోళ్లను ఢీకొని పడిపోయే పరిస్థితులు కూడా లేకపోలేదు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి సమాంతరంగా యూజీడీ మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



దెబ్బతిన్న యూజీడీ మ్యాన్‌హోల్

ఇదేనా పర్యవేక్షణ..?

జీవీఎంసీ ఇంజినీర్లు రోడ్లు నిర్మించిన తర్వాత మళ్లీ వాటిని పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. నిర్వహణ గురించి కనీస స్థాయిలో కూడా పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి సచివాలయంలో ఎమినిటీస్ కార్యదర్శులు ఉంటారు. వీరు కూడా రోడ్డు వైపు కనీసం కన్నెత్తి చూడని పరిస్థితి దాపురించిందని, దీంతో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా తయారయ్యాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మ్యాన్‌హోల్ వద్ద గుంతలు

టెన్త్ విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



ఎన్‌జీజీవోస్ కాలనీలో ఇంటి వద్ద విద్యార్థులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థి ప్రగతి గురించి తల్లికి వివరిస్తున్న రైల్వే న్యూకాలనీ హైస్కూల్ ఉపాధ్యాయులు

సీతంపేట: జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు గ్రామ సందర్శనం పేరిట వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు గురువారం రాత్రి టెన్త్ విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. రాబోయే నాలుగైదు నెలలు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు తీసుకోవలసిన శ్రద్ధ, జాగ్రత్తలు వివరించారు. ఎఫ్ఏ1, 2ల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, అసెస్‌మెంట్ బుక్స్ చూపించి, మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుసరించవలసిన జాగ్రత్తలు, పిల్లలను ఎలా చదివించాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు శ్యామల, అప్పారావు, పీడీ రత్నం, సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎస్.వి.శేషుకుమారి, ఉపాధ్యాయుల నేతృత్వంలో గురువారం రాత్రి వేళలో 10వ తరగతి విద్యార్థుల గృహాలను సందర్శించారు. రాబోయే టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్లు హెచ్ఎం శేషుకుమారి తెలిపారు. ఇంతవరకు జరిగిన పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలను తల్లిదండ్రులకు తెలియజేశారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు చేయాల్సిన ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతమ్మధార మండల విద్యా శాఖాధికారులు డి.రామారావు, బాలామణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉమా, లక్ష్మి, వజీదా, సోఫియా, హేమకుమారి, సుజాత, ఈశ్వరి, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

ఎంవీపీ కాలనీ: గుర్తు తెలియని ఓ వాహనం ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధారకు చెందిన టీకి యాదవరావు అనే యువకుడు నగరంలోని ఓ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న రాత్రి విధులు ముగించుకుని కృష్ణా కళాశాల మీదుగా ఇంటికి వెళ్తుండగా హెచ్‌బీ కాలనీ జంక్షన్ వద్ద సీతమ్మధార వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. యువకుడి కుడి కాలుతోపాటు కాలర్ బోన్ విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే యాదవరావుతో పనిచేసే కొందరి సాయంతో స్థానికులు 108లో కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓమ్ని ఆర్కే ఆస్పత్రికి తరలించారు. యాదవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అట్రాసిటీ కేసుల పెరుగుదల



మాట్లాడుతున్న అంద్ర మాల్యాద్రి

డాబాగార్డెన్స్: రాష్ట్రంలో అట్రాసిటీ కేసులు పెరుగుతున్నా.. కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆరోపించారు. ప్రభుత్వ రంగం-సామాజిక న్యాయం పేరిట గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలపై నానాటికీ దౌర్జన్యాలు, లైంగిక దాడులు, గ్రామ బహిష్కరణలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లో అట్రాసిటీ కేసులు నమోదవుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగంలో ఒక్క పరిశ్రమ కూడా నిర్మించకపోగా ఉన్న శాశ్వత ఉద్యోగాలు తొలగించడం, బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లయినా ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదన్నారు. రిజర్వేషన్లు ఒక్క ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూనే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం కృషి చేసినప్పుడే సామాజిక న్యాయం అమలవుతుందని చెప్పారు. సిటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ఒక్క ప్రభుత్వ రంగంతోనే సాధ్యమవుతుందని, ప్రైవేట్ కంపెనీలు వారి లాభాల పైనే దృష్టి పెడతారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, ఉపాధ్యక్షుడు వై.రాజు, విశాఖ జిల్లా పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ స్వర్ణోత్సవాల విస్మరణ తగదు

డాబాగార్డెన్స్: సమీకృత శిశు అభివృద్ధి పథకం 1975లో ప్రారంభమైందని, దీని వల్ల యావత్ దేశంలో పేద మహిళలు, పిల్లల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. సిటు కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ విశాఖ జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆ పథకం స్వర్ణోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం తగదన్నారు. ఈ పథకం వల్ల ఎంతో మేలు జరుగుతుందని పలు నివేదికలు స్పష్టం చేసినా.. ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నట్లు కనపడుతోందని ఆరోపించారు. కీలకమైన ఐసీడీఎస్ పథకానికి మోదీ ప్రభుత్వం బడ్జెట్ తగ్గించడం ద్వారా నిర్వీర్యం చేయడాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరిట అర్హులైన వారిని తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఐసీడీఎస్‌లో కీలకంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీలకు జీతాలు పెంచని కారణంగా కేంద్ర మంత్రుల కార్యాలయాల వద్ద నవంబర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారుల సంఖ్య కుదించవద్దని నవంబర్ 14న చిన్న పిల్లలతో అన్ని జిల్లాల్లో ధర్నాలు చేయాలని తెలిపారు. సిటు అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో వాటి విజయవంతానికి అంగన్‌వాడీలంతా కృషి చేయాలని కోరారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరాభారం



కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కడితి చిరంజీవి, పార్టీ శ్రేణులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా జ్యోతినగర్‌లోని పార్టీ వార్డు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కడితి చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న 'కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై ప్రజలను చైతన్యపరిచి కూటమి ప్రభుత్వం కుటిల బుద్ధిని ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణలో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరాభారమవుతుందన్నారు. అనంతరం కార్యకర్తలకు పోస్టర్లు అందజేశారు. కార్యక్రమంలో కొటకల కుమార్, సిహెచ్.శ్రీను, గిన్ని రాధాకృష్ణరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కె.రవణమ్మ, యు.అచ్యుతరావు, బి.మోహన్, వెలగ శ్రీను, సాక్షి శ్రీను, బి.హరనాథ్‌రెడ్డి, దంతేశ్వరరావు, బి.లక్ష్మీరెడ్డి, సీరపు దివాకర్‌రెడ్డి, బసవ దిలీప్, చైతన్య, పరాన్న, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.సుగుణ, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో కోటి సంతకాల సేకరణ



24వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

తాటిచెట్లపాలెం: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా గురువారం 24వ వార్డులో సంతకాల సేకరణ ప్రారంభించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మేధావులు, విద్యార్థుల నుచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడ్ల అశోక్‌రెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, లోకేష్, సీతాకుమారి, రామకృష్ణారెడ్డి, లావణ్య, కుసుమ, రమ, పద్మ,దేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాల్సిందే..



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను గురువారం కంచరపాలెం సీఐ రవికుమార్, ట్రాఫిక్ ఎస్ఐ దాశరథి సందర్శించారు. అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ, రాష్ట్ర పన్నుల శాఖ అనుమతులకు లోబడి దుకాణదారులు వ్యాపారాలు చేయాలని వారు సూచించారు. ఆయా శాఖల అనుమతుల పత్రాలను పరిశీలించారు. దీపావళి స్టాళ్ల నిర్వాహకులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. స్టాళ్ల మధ్య నిర్ణీత దూరం ఉండాలని, దుకాణాల వద్ద నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు సాగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం 6 గంటలకు, శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన జరుగుతుందని పేర్కొన్నారు. కార్తీక ఆకాశ దీపారాధన నెల రోజులకు రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. నవంబర్ 1న ఏకాదశి ఉదయం 9 గంటలకు శ్రీవారికి తులసీ దళాలతో అర్చన, 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, 15న సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తామని చెప్పారు. సత్యనారాయణ వ్రతంలో పాల్గొనాల్సిన వారు రూ.500 రుసుము చెల్లించాలన్నారు.

ప్లైవుడ్ కార్మికుల నిరసన



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ప్లైవుడ్ కార్మికులు

సీతంపేట: ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అన్నారు. కార్మికులతో కలిసి గురువారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచలేదని, నిత్యావసర సరకుల ధరలు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగాయని, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు పెరిగిపోవడంతో ఆర్థిక భారం పడుతోందన్నారు. అనారోగ్యమైనా మందులు కొనలేని పరిస్థితిలో కార్మికులు ఉన్నారని తెలిపారు. కూలీ రేట్లు పెంచాలని రెండు నెలల కిందట డీసీఎల్‌కు వినతి పత్రం అందజేసినా.. కార్మికుల బాధలు అధికారులకు పట్టడం లేదన్నారు. కార్యాలయానికి వెళ్తే అందుబాటులో ఉండటం లేదని, డీసీఎల్ యాజమాన్యంతో మాట్లాడి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్లైవుడ్ కార్మికుల కూలీ రేట్లు తక్షణమే పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మేస్త్రీలు వై.రాజు, చిన్నారావు, వెంకటరావు, చంటి, సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరిక



స్పెన్సర్స్ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



29వ వార్డులో పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేసి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్-3, జోన్-4 పరిధి 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత పనులను కమిషనర్ పరిశీలించారు. జోన్-3 పరిధి మద్దిలపాలెం జంక్షన్ నుంచి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా పరిశుభ్రత పనులను పరిశీలిస్తూ, స్పెన్సర్స్ జంక్షన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు కమిషనర్ గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటన చెత్త తొలగించి, బాధ్యులైన దుకాణ యజమానులపై జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడంపై ఆయన దుకాణ యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 17, 20 వార్డుల పర్యటనలో భాగంగా పెదవాల్తేర్ గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ చెత్త తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని ఆదేశించారు. నివాసితులు, వ్యాపారులు తమ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేయాలని, వాడి పారేసిన కప్పులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. జోన్-4 పరిధి 29వ వార్డు దండుబజార్ వద్ద జీవీఎంసీ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. సమయానికి డ్యూటీకి హాజరు కావాలని, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు రోజువారీ పర్యవేక్షణ చేపట్టి, నగరాన్ని చెత్త రహితంగా ఉంచాలని ఆదేశించారు. వాకీ టాకీ ద్వారా జోనల్ కమిషనర్లు సంబంధిత ప్రాంతాల్లో సిబ్బంది, క్లాప్ వాహనాలు సక్రమంగా వినియోగించి, ప్రతి రోజూ పరిశుభ్రతపై పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు.

బీచ్ రోడ్డులో సీపీఆర్‌పై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వైద్యులు

మహారాణిపేట: ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవం, సీపీఆర్ అవగాహన వారోత్సవం సందర్భంగా కాళీ మాత ఆలయం సమీపంలోని బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనస్థీషియా సొసైటీ, ఆంధ్ర మెడికల్ కాలేజ్ అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని సీపీ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రస్థాయి రోగులకు చికిత్స అందించడంలో అనస్థీషియాలజిస్టులు, అత్యవసర వైద్యులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. సీపీఆర్ శిక్షణను సంవత్సరంలో ప్రతిరోజూ నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, విశాఖ అనస్థీషియా సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె. అపరంజి, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కేజీహెచ్‌లో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలక్ష్మి సహా పలువురు ప్రముఖ అనస్థీషియాలజిస్టులు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్లు, వైద్యులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో యువజనోత్సవాలు



బ్యానర్ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రిన్సిపాల్ షైజీ, నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో ఎక్సెల్సియర్-25 యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం ఎక్సెల్సియర్ పోస్టర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఏయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు రెండు రోజుల పాటు జరిగే యువజనోత్సవాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధ కోరారు. 2016 నుంచి కళాశాల నిర్వహిస్తున్న వార్షిక విద్యార్థి ఉత్సవాల్లో ఇది భాగమని చెప్పారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులు వేడుకలకు హాజరవుతారని కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. ఎక్సెల్సియర్ కమిటీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.